ఎన్నికల ప్రచారంలో జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌లో కారుజోరు...
ప్రచార హోరు

ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

- అక్కన్నపేట మండలంలో ఏడు గ్రామాలు మినహా మొదటి విడత ప్రచారం పూర్తి
- భీమదేవరపల్లి మండలంలో వీరభద్రస్వామి సన్నిధిలో పూజల అనంతరం ప్రచారం షురూ
- గ్రామగ్రామాన ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు
- జరిగిన అభివృద్ధి... అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓటేయాలని ఓటర్లకు వొడితెల సతీశ్‌కుమార్ వినతి

హుస్నాబాద్, అక్టోబర్ 26: హుస్నాబాద్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కారు జోరందుకుంది. ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామాల్లో గులాబీ శ్రేణుల ప్రచార హోరు ఉత్సాహంగా కొనసాగుతోంది. ప్రతిపక్ష నాయకుల టికెట్లు ఖరారు కాకుండా ఆయా పార్టీల నాయకులు ఏం చేయాలో తోచక అయోమయంలో ఉంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్ మాత్రం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే రెండు మండలాల్లో ప్రచారం ప్రారంభించిన సతీశ్‌కుమార్ ఒక ప్రణాళికతో ఊరూరా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామానికి వచ్చిన సతీశ్‌కుమార్‌కు జననీరాజనం లభిస్తోంది. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై మంగళహారతులతో స్వాగతం పలుకుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా సతీశ్‌కుమార్‌ను పిలుచుకునే పార్టీ క్యాడర్ ఆయా గ్రామాల్లో రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొంటున్నారు. మూడోసారి కూడా భారీ మెజార్టీతో సతీశ్‌కుమార్‌ను గెలిపించి గులాబీ జెండాకు తిరుగులదని నిరూపించుకోవాలని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టుదలతో పనిచేస్తున్నారు. దీంతో హుస్నాబాద్‌లో గులాబీ జెండా మూడోసారి రెపరెపలాడటం ఖాయమనేది స్పష్టమవుతోంది.

పూజల అనంతరం ప్రచారం షురూ..

హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ మొట్టమొదటి ప్రచారాన్ని నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం జగన్నాథపురంలో సెప్టెంబర్ 6న షురూ చేశారు. స్థానిక హనుమాన్ ఆలయంలో కుటుంబ సభ్యులతోపాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రత్యేక పూజల అనంతరం అదే గ్రామంలో ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు. అనంతరం అక్కన్నపేట మండలంలోని మంచినీళ్లబండ గ్రామంతో ప్రచారాన్ని ప్రారంభించి రోజుకు 6 నుంచి 10 గ్రామాల్లో సుడిగాలి పర్యటనల ద్వారా ప్రచారాన్ని హోరెత్తించారు. అక్కన్నపేట మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఏడు గ్రామాలు మినహా మిగతా అన్ని గ్రామాల్లో మొదటి విడత ప్రచారాన్ని పూర్తి చేశారు. 26వ తేదీ గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అక్కడ ప్రచారం ప్రారంభించారు. కొత్తకొండ గ్రామం అనంతరం చంటయ్యపల్లి, ధర్మారం, రసూల్‌పల్లి, వీర్లగడ్డతండా, మల్లారం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజలనుంచి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో మొదటి విడత ప్రచారాన్ని పూర్తి చేసి రెండో విడత ప్రచారానికి సైతం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సన్నద్ధం అవుతున్నారు.

సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభతో రెట్టించిన ఉత్సాహం

సీఎం కేసీఆర్‌కు సెంటిమెంట్‌గా భావించే హుస్నాబాద్‌లో ఈనెల 15న జరిగిన ప్రజా ఆశీర్వాద సభతో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చింది. దీంతో రెట్టించిన ఉత్సాహంతో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. సీఎం కేసీఆర్‌కు ఇష్టమైన హుస్నాబాద్‌లో మళ్లీ గులాబీ జెండానే ఎగిరేలా కలిసికట్టుగా పనిచేయాలనే లక్ష్యంతో పార్టీ క్యాడర్ ముందుకు పోతోంది. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సైతం తిప్పికొడుతూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు గ్రామాల్లోనూ ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

అభివృద్ధిని వివరిస్తూ... ఆప్యాయంగా పలకరిస్తూ...

ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ...ప్రచారానికి వచ్చిన కార్యకర్తలు, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా అక్కడ జరిగిన అభివృద్ధిని కూలంకశంగా వివరిస్తున్నారు. అక్కడ అమలవుతున్న సంక్షేమ పథకాలను సైతం వివరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఇంకా పరిష్కారం కాని సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులను, పాత, కొత్త క్యాడర్‌ను కలుపుకుపోతున్నారు. ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరే యువకులు, నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారు. హుస్నాబాద్ వరప్రదాయని గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు మూడోసారి ప్రజలు ఆశీర్వదిస్తే ఏం చేయబోతున్నారనే విషయాలను కూడా ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

జగన్నాథపురంలో మొదటి రోజు ప్రచారానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు

గజ్వేల్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు

గజ్వేల్‌లో లక్ష మెజార్టీ రావాలి

గజ్వేల్ ప్రజలు నియత్ గలోళ్లు

- కేసీఆర్ రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం
- తెలంగాణలో వందశాతం మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే..
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తాం
- నవంబర్ 30 తర్వాత ప్రతిపక్ష నేతలు పత్తా ఉండరు..
- నా వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పనిచేసి పెట్టా..
- గజ్వేల్ ప్రజలు కేసీఆర్ వెంటే ఉంటారు..
- గజ్వేల్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, అక్టోబర్ 26: గజ్వేల్ ప్రజలు నియత్ గల్లోళ్లని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్‌లో గురువారం నియోజకవర్గ ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ గజ్వేల్‌కు రావడం ప్రజలందరి అదృష్టమని, కేసీఆర్ రాక ముందు గజ్వేల్ ఎలా ఉండే.. ఇప్పుడు ఎలా ఉందనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. కేసీఆర్ మొన్న చాలా గొప్ప విషయం చెప్పారని, ఇక నుంచి నెలకు ఒకసారి మీతో గడుపుతానని మాట ఇచ్చారని గుర్తుచేశారు. కోమటిబండకు ప్రధాని నరేంద్రమోదీ మిషన్ భగీరథ ప్రారంభించడానికి వచ్చారంటే ముఖ్యమంత్రి కేసీఆర్ లేనిదే ఇంత మంచి అభివృద్ధి పని అయ్యేదా అనే విషయాన్ని ఆలోచించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో కలిసి పనిచేసి మంచి మెజార్టీ సాధించాలని సూచించారు. గజ్వేల్ ఎన్నికలంటే చాలా ప్రాముఖ్యత కలవని, ఈ రోజు గజ్వేల్‌కు చాలామంది వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారని, మనల్ని మభ్యపెడుతారని, కానీ నవంబర్ 30 తర్వాత వారెవరూ ఇక్కడ కనిపించరన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్ పోటీ చేయకుంటే మన హయాంలో కట్టించిన బిల్డింగ్‌లకు సున్నాలు కూడా వేయలేరన్నారు. మనం అందరం ప్రజా జీవితంలే ఉన్నామని, తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పని చేసి పెట్టానని, ఎలాంటి పైరవీలకు తావులేకుండా మీరు చెప్పిన పని చేశానని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

వందశాతం అధికారంలోకి వస్తాం...

తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం వందకు వందశాతం ఏర్పాటు కావడం ఖాయమని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పదికి పది స్థానాల్లో కచ్చితంగా బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుస్తారని అన్నారు. ఈ రోజు ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మంచి పేరు ఉన్నదన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులను కలిసి కేసీఆర్‌కు ఓటు వేసేలా చూడాలన్నారు. రైతుబంధు డబ్బులు 69లక్షల మందికి ఇస్తునామని తెలిపారు. కరెంట్, ఎరువులు, చెరువుల మరమ్మతులు పూర్తి చేశామన్నారు. ఇప్పుడు ఏ ఊర్లో కూడా నీళ్ల కోసం బోర్లు వేసే పరిస్థితి లేదన్నారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే సీఎం కేసీఆర్ ఈసారి రైతుబంధు డబ్బులను పెంచుతామని ప్రకటించారన్నారు. ఈ విషయాన్ని రైతులకు, ప్రజలకు వివరించాలన్నారు. భూమి శిస్తు, కరెంట్ బిల్లులు రైతుల వద్ద నుంచి వసూలు చేయడం లేదని తెలిపారు. సమైక్య పాలనలో 29 లక్షల పింఛన్లు మాత్రమే ఇస్తే, తాము 47లక్షల వరకు పింఛన్లు ఇస్తున్నామని, ఈసారి పింఛన్ రూ.5వేలు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా కేసీఆర్ ఉన్నారని, రేషన్ ద్వారా సన్నబియ్యం ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టినట్లు తెలిపారు. ప్రతి వ్యక్తికి కేసీఆర్ బీమా అమలు చేస్తామన్నారు. ఇవన్నీ గడపగడపకూ వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేసి అఖండ విజయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కట్టబెట్టాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. గజ్వేల్ ప్రజలు కేసీఆర్‌కు లక్ష మెజార్టీ ఇవ్వాలన్నారు. కేసీఆర్ కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని, సద్దితిన్నరేవును తలవాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ గ్రామస్థాయిలో పనిచేస్తే బీజేపీ, కాంగ్రెస్‌కు డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమని మంత్రి హరీశ్‌రావు జోస్యం చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణశర్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు మాదాసు శ్రీనివాస్, జహంగీర్, నాయకులు శేఖర్‌గౌడ్, కొట్టల యాదగిరి, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, మండల సమన్వయ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యకర్తలకు దిశానిర్దేశం

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 26: కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి పిలునిచ్చారు. గురువారం గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో మున్సిపల్ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త, నాయకుడు సీఎం కేసీఆర్ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించి, కేసీఆర్‌ను గజ్వేల్ నుంచి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఇంటింటికీ ప్రభుత్వం నుంచి ఏదోవిధంగా లబ్ధి చేకూరిందన్నారు. చేసిన పనులను ప్రజలకు వివరించి భవిష్యత్తులో సీఎం కేసీఆర్ చేయబోయే పనులను వివరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, జడ్పీటీసీ పంగమల్లేశం, ఆత్మకమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

పేదల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- ప్రజల కష్టం తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్
- అబద్ధాలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దు
- బీఆర్‌ఎస్‌ను మరోసారి దీవించి.. భారీ మెజార్టీతో గెలిపించాలి
- చేగుంట మండలంలో ఎన్నికల ప్రచారంలో మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్‌లో అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, అక్టోబర్ 26: పేదల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని, ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని మెదక్ పార్లమెంట్ సభ్యుడు, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం చేగుంట మండలంలో బోనాల్, పులిమామిడి, కిష్టాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ప్రభాకర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర పార్టీల నాయకులు చెప్పే మాటలు నమ్మవద్దని, బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి దీవించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికలు వచ్చిన సందర్భంగా అనేక పార్టీల నాయకులు రకరకాల హామీలు ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశం ఉన్నదన్నారు. ముడేండ్ల కిందట ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసి గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు మరోసారి మోసపోవద్దని, అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్‌కు పట్టంకట్టి, కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎంపీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మంచిక్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రజనక్ ప్రవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు రంగయ్యాగారి రాజిరెడ్డి, ఇబ్రహీంపూర్, బోనాల్, పులిమామిడి కిష్టాపూర్, రుక్మాపూర్ సర్పంచ్‌లు దొరగొల్ల రాములు, బాలమల్లయ్య, గొర్రె రేణుకారమేశ్, బస్కి స్వప్నాఅంజిరెడ్డి, ఎంపీటీసీలు నవీన్, గాండ్ల లతానందం, హోళియనాయక్, బింగి గణేశ్, మెతుకు శ్రీను, సర్పంచులు కుమ్మరి శ్రీనివాస్, ఊరడి మహిపాల్, సొసైటీ చైర్మన్లు వంటరి కొండల్‌రెడ్డి, మ్యాకల పరమేశ్, వైస్ చైర్మన్ తానీషా, తీగుల్ల అంజనేయులు, మాజీ చైర్మన్ కోమండ్ల నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నాయిని రాజ్‌గోపాల్, మ్యాకల వెంకటస్వామి, నాయకులు లచ్చిరెడ్డి, బాపురెడ్డి, ఎగ్గడి శేఖర్, రమేశ్ తదితరులున్నారు.

హైదరాబాద్‌లో శంకర్‌యాదవ్‌కు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

పటాన్‌చెరు బీజేపీకి ఝలక్

బీఆర్‌ఎస్‌లోకి మాజీ కార్పొరేటర్

- మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ సమక్షంలో చేరిక
- బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి
- సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- శంకర్‌యాదవ్ రాకతో పటాన్‌చెరులో అజేయశక్తిగా బీఆర్‌ఎస్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధే అఖండ విజయం అందిస్తుంది
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు, అక్టోబర్ 26: పటాన్‌చెరు బీజేపీకి ఝలక్ ఇస్తూ బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్ బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు, హోం మంత్రి మహమూద్ అలీ గులాబీ కండువా కప్పి శంకర్‌యాదవ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ తీసుకున్న నిర్ణయాన్ని మంత్రి హరీశ్‌రావు అభినందించారు. బీఆర్‌ఎస్ ఇప్పుడు అజేయశక్తి అని మంత్రి పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారన్నారు. మూడోసారి కూడా బీఆర్‌ఎస్ విజయం సాధించడం ఖాయమని మంత్రి అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు, కుట్రలు చేసినా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం మాదేనన్నారు. సంక్షేమం విషయంలో తెలంగాణ ఇప్పుడు దేశానికే ఆదర్శమన్నారు. సీఎం కేసీఆర్ పాలసీలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా పరిగెత్తాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను మంత్రి కోరారు. శంకర్‌యాదవ్ వంటి ప్రజాకర్షణ కలిగిన నాయకుడు బీఆర్‌ఎస్‌లో చేరడం పార్టీకి మేలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరులో పార్టీ అజేయశక్తిగా మారిందన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందన్నారు. ప్రజల్లో మంచి పేరున్న శంకరన్న బీఆర్‌ఎస్‌లో చేరడం పార్టీకి ఎంతో మేలు చేస్తుందన్నారు. పటాన్‌చెరులో అఖండ మెజార్టీతో గెలుస్తున్నామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. త్వరలో భారీ చేరికలుంటాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, నగేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపూర్‌లో ఏకగ్రీవ తీర్మానం పత్రాన్ని ఎంపీకి అందజేస్తున్న దాసరి కులసంఘం సభ్యులు

సబ్బండ వర్గాలు సీఎం కేసీఆర్ వైపే

ప్రజలు ఆశీర్వదిస్తే మరింతగా సేవచేస్తా

- బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి
- మద్దతు ప్రకటించిన ఖాజీపూర్ గ్రామదాసరి కుల సంఘం సభ్యులు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 26: రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలు కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయడానికి ఎదురుచూస్తున్నారని దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఖాజీపూర్ గ్రామ దాసరి కుల సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. దాసరి సంఘం కుల సభ్యులు బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు వేస్తామని సంయుక్తంగా ప్రకటించి ఏకగ్రీవంగా తీర్మానం చేసిన పత్రాన్ని ఆయనకు అందజేసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖాజీపూర్ గ్రామ దాసరి కుల సంఘ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. తనను గెలిపిస్తే మరింత సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మమతామాధవ్, ఎంపీటీసీ భాగ్యలక్ష్మీచిరంజీవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, పార్టీ మండల సీనియర్ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు పరశురాములు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, వీరయ్య, దాసరి కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.